
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి
5
మెదక్
జిల్లాల వార్తలు
శుక్రవారం 7 నవంబరు 2025



పాఠశాలలో క్షుద్రపూజల కలకలం
భయాందోళనలో తల్లిదండ్రులు, గ్రామస్థులు
తరగతులకు వెళ్లని విద్యార్థులు
గ్రామానికి నలుదిక్కులా పూజా సామగ్రి
మూఢవిశ్వాసమంటూ కాళ్లతో చెరిపేసిన హెచ్ఎం
పుల్కల్ మండలం ముదిమాణిక్యంలో సంఘటన 7

వెల్‌నెస్ సెంటర్‌లో మందుల కొరత

అరకొర సరఫరాతో ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు అవస్థలు



సంగారెడ్డిలోని వెల్‌నెస్ సెంటర్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోని వెల్‌నెస్ సెంటర్‌లో మందుల కొరత వేధిస్తోంది. 300 రకాల మందులు అందుబాటులో ఉండాల్సి ఉండగా, 100 రకాలు కూడా లేవు. ఫలితంగా ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానమైన బీపీ, షుగర్, థైరాయిడ్, నొప్పులకు సంబంధించిన అయింట్‌మెంట్లు, మల్టీ విటమిన్ సిరప్‌లు చాలారకాల కాంబినేషన్ మాత్రలు నెల రోజులుగా అందుబాటులో లేవు. నిత్యం సుమారు 50 నుంచి 100 మంది వరకు వరకు వైద్య చికిత్సలతో పాటు మందుల కోసం వస్తుంటారు. డాక్టర్ రాసిన మాత్రల్లో సగం వరకు అందుబాటులో లేకపోవడంతో బయట కొనుగోలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

రెండ్రోజుల్లోనే స్టాక్ ఖాళీ

వెల్‌నెస్ సెంటర్‌కు పైనుంచి మందులు అరకొరగా సరఫరా కావడంతో వచ్చిన ఒకట్రెండు రోజుల్లో అయిపోతున్నాయని సిబ్బంది పేర్కొంటున్నారు. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెగ్యులర్‌గా వాడే మాత్రలు లేకపోవడం శోచనీయమని, డాక్టర్లుంటే సరిపోదని సరిపడా మందులు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాల్సిన అవసరముందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి వెల్‌నెస్ సెంటర్‌లో మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సంగారెడ్డి గురుద్వారా వేడుకల్లో జగ్గారెడ్డి

- డోలక్ వాయిస్తూ ప్రార్థనలో పాల్గొన్న జగ్గారెడ్డి
- సంప్రదాయకంగా ఆశీర్వదించిన సిక్కు మతపెద్దలు
- ర్యాలీలో కత్తి విన్యాసంతో జోష్ నింపిన జగ్గారెడ్డి
- గురుద్వారాకు వెళ్లేదారిలో కమాన్ నిర్మాణానికి హామీ
- సిక్కులకు ప్రత్యేక కమ్యూనిటీహాల్ ఏర్పాటుకు నిర్ణయం



గురునానక్ జయంతి ఉత్సవాల్లో జగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సిక్కుల ఆరాధ్య దైవం గురునానక్ 556వ జయంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని పురాతన గురుద్వారాలో ఘనంగా ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా తూర్పు జగ్గారెడ్డి గురుద్వారాను సందర్శించగా మత పెద్దలు సాంప్రదాయ రీతిలో ఆయనను ఆశీర్వదించారు. అనంతరం జరిగిన భజన లో డోలక్ వాయిస్తూ ఆకర్షించారు. తర్వాత పట్టణంలో చేపట్టిన ర్యాలీలో పాల్గొని కత్తి విన్యాసాలు చేస్తూ జగ్గారెడ్డి జోష్ నింపారు. సిక్కు మత పెద్దల కోరిక మేరకు గురుద్వారాకు వెళ్లేదారిలో కమాన్ ఏర్పాటు చేయిస్తానని, అదేవిధంగా సిక్కుల కోసం ప్రత్యేక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి జగ్గారెడ్డి హామీ ఇచ్చారు. తగిన డిజైన్ చేసుకుంటే తాను కట్టిస్తానని చెప్పారు.



సంగారెడ్డి పురాతన గురుద్వారాలో జరిగిన గురునానక్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న జగ్గారెడ్డి



రైతుల ఖాతాల్లోకి
ట్రిపుల్ ఆర్ పరిహారం

నర్సాపూర్ డివిజన్‌లో 4 గ్రామాలకు రూ. 3.75కోట్లు

నర్సాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఆర్ రోడ్డు కోసం భూములిచ్చిన రైతులకు ఎట్టకేలకు పరిహారం మంజూరైంది. నర్సాపూర్ డివిజన్‌లో నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లో 13 గ్రామాల్లో నాలుగు గ్రామాలకు చెందిన రైతులకు రూ. 3.75కోట్లు మంజూరయ్యాయి. డివిజన్‌లో నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లో 13 గ్రామాల్లో 1,048 మంది రైతుల నుంచి 758 ఎకరాలను ట్రిపుల్‌ఆర్ కోసంసేకరించారు. ఇందులో నర్సాపూర్ మండలం నాగులపల్లి, తిర్మలాపూర్, శివ్వంపేట మండలం గుండ్లపల్లి, పాంబండ గ్రామాల రైతులకు పరిహారం మంజూరు చేస్తూ ఆర్థికశాఖ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఆర్డీవో మహిపాల్ పేర్కొన్నారు. తిర్మలాపూర్‌లో 9 మంది రైతులకు రూ.20,51,697, నాగులపల్లిలో 26 మందికి రూ.61,18,098, గుండ్లపల్లిలో 12 మందికి రూ. 2,77,47,075, పాంబండలో ముగ్గురికి రూ. 15,85,670 చొప్పున మంజూరయ్యాయి. ఈ మొత్తం రెండు రోజుల్లో వారి ఖాతాలోనే జమవుతుందని ఆర్డీవో పేర్కొన్నారు. మిగిలిన గ్రామాల రైతులకూ త్వరలోనే పరిహారం మంజూరవుతుందని ఆయన తెలిపారు.

ఇసుకే బంగారమాయె..!

టన్ను రూ. 3వేలు

ఆరు నెలల్లో రెట్టింపైన ధర
ఇందిరమ్మ ఇళ్లకు ఇబ్బందులు
గృహ నిర్మాణాలపై భారీగా భారం

తూప్రాన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇసుక ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ధరలు పెరిగిపోవడంతో ఇళ్ల నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక క్వారీల కేటాయింపు తగ్గడంతో లభ్యత తగ్గి డిమాండ్ పెరిగింది. ఇదే అదనుగా సరఫరాదారులు ధరలు పెంచేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు అవసరమైన ఇసుకను స్థానికంగా ఇసుక క్వారీలతో పాటు కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రచలం తదితర ప్రాంతాల నుంచి సరఫరా అవుతుంది. ఇసుక వేలం ప్రక్రియను టీజీ ఎండీసీ సంస్థ ఆన్‌లైన్‌లో ప్రతీరోజు చేపడుతుంది. ఉదయం సమయంలో ఐదు నిముషాల్లోనే స్లాట్ బుకింగ్స్ పూర్తవుతాయి. ఐదు నిమిషాలే సమయం ఉండటంతో సాధారణ ప్రజలు బుక్ చేసుకోవడానికి అవకాశం లేకుండాపోతోంది. హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యం, బుకింగ్ ప్రక్రియపై అవగాహన ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. టీజీ ఎండీసీలో నమోదు చేసుకున్న లారీ పేరుతో బుక్ చేయాల్సి ఉంటుంది. లారీలు ఎక్కువ బుక్ కాకపోవడంతో ధరలు పెరిగిపోయాయి.

తక్కువ ఇసుక కేటాయింపు

ఇసుక క్వారీల నుంచి లారీలకు ఇసుకను తక్కువగా కేటాయిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురిసి గోదావరిలో నీరు ఉండటంతో లారీలకు ఇసుక కేటాయింపును ప్రభుత్వం తక్కువ చేస్తున్నట్లు చెబుతున్నారు. గతంలో ఏ లారీకైనా ప్రతీరోజు ఆన్‌లైన్‌లో కేటాయింపు జరిగేది. ప్రస్తుతం ఒకసారి ఇసుక కేటాయింపు చేసిన లారీలకు మరోసారి వారం తరువాతనే అవకాశం దొరుకుతోంది. దీంతో ఒక్కో లారీ వారం రోజులు ఖాళీగా ఉండాల్సి వస్తోంది.



నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

బుకింగ్ కమిషన్ పెంపు

టీజీ ఎండీసీలో ఇసుక కేటాయింపు ఆన్‌లైన్‌లో బుకింగ్ (డీడీ) లభించడం గగనమైంది. గతంలో 35 టన్నుల లారీకి రూ. 14,600 ఉండగా, బుక్ చేసినందుకు రూ. 1500 తీసుకునేవారు. ప్రస్తుతం ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసినందుకు లారీకి రూ.7వేల నుంచి రూ. 8వేలు తీసుకుంటున్నారు. సాధారణగా బుక్ చేసుకోడానికి అవకాశం లభించదంటూ భయపెడుతున్నారు. బిల్డర్లు టీజీ ఎండీసీ నుంచి బల్క్ ఆర్డర్‌ను పొందుతుంటారని చెబుతున్నారు. కొందరు బిల్డర్లు బల్క్ ఆర్డర్ పొంది బ్లాక్‌లో విక్రయిస్తుండటంతో అధిక ధరలకు అమ్మకాలు చేస్తున్నట్లు చెబుతున్నారు.

ధరలు రెట్టింపు

డిమాండ్ పెరగడంతో ఇసుక ధరలు రెట్టింపు అయ్యాయి. గతంలో టన్ను ఇసుక ధర రూ.1200 నుంచి రూ. 1500 వరకు పలికేది. కానీ, ఐదారు నెలలుగా ఇసుక ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. తొలుత రూ. 1800, తరువాత రూ. 22,00, రూ, 2,400.. ఇలా పెరుగుతూ ప్రస్తుతం రూ. 3వేలు పలుకుతున్నది. రోజురోజుకూ బంగారం ధర పెరిగినట్లు ఇసుక ధరలు పెరుగుతున్నాయని భవన నిర్మాణదారులు వాపోతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపైనా ఇసుక ధరల పెంపు ప్రభావం చూపిస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకే ఇసుక కేటాయిస్తున్నట్లు చెబుతున్నా ఆచరణలో కనిపించడంలేదు. నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఇసుక బజారులో ఇసుక లభించడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఇసుక లభించడం లేదు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఇసుక కేటాయిస్తామని అధికారులు, ప్రభుత్వం చెబుతున్నారు. అదే భరోసాతో పనులు మొదలు పెట్టాం. స్లాబ్ వరకు పనలుఉ చేసినా ఇప్పటి వరకు కనీసం టన్ను ఇసుక ప్రభుత్వం కేటాయించ లేదు. మార్కెట్‌లో టన్ను ఇసుక రూ. 3వేలకు కొనుగోలు చేస్తున్నాం. ఇసుక ధరలు పెరగడంతో ఇంటి బడ్జెట్ పెరిగిపోతున్నది. ప్రభుత్వం ఇచ్చే పైసలు ఇంటి నిర్మాణానికి సరిపోవడం లేదు.

-వెంకటలక్ష్మి, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు



నర్సాపూర్ మండలం పెద్దచింతకుంటలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ కార్యదర్శి గౌతమ్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
త్వరితగతిన పూర్తిచేయాలి

గృహనిర్మాణ కార్యదర్శి గౌతమ్

నర్సాపూర్/మెదక్ కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కళ నెరవేర్చాలనే ఉద్దేశంతో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేసుకోవాలని గృహనిర్మాణ కార్యదర్శి గౌతమ్ పేర్కొన్నారు. నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట, మెదక్ మండలంలోని మాచవరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, మెటీరియల్ లభ్యత వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పెద్దచింతకుంట గ్రామంలో 11 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయితే మూడు ఇంకా ప్రారంభం కాకపోవడంపై కారణాలను తెలుసుకున్నారు. మంజూరైన ఇళ్లను త్వరలోనే ప్రారంభించాలని, నిర్మాణం పూర్తయిన ఇళ్లకు డబ్బులు మంజూరు చేయించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవో మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మధులత, హసింగ్ పీడీ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

పూల తోట.. సిరుల బాట!
- బంతిపూల సాగు వైపు రైతుల ఆసక్తి
- ఎకరానికి రూ.5 లక్షల వరకు లాభం 7



నర్సింగ్ కాలేజీ పనుల పురోగతిని పరిశీలిస్తున్న సీఈ శశిధర్

నర్సింగ్ కాలేజీ పనులు
త్వరితగతిన పూర్తి చేయాలి

టీజీఎంఎస్ఐడీసీ సీఈ శశిధర్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నర్సింగ్ కాలేజీ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని టీజీఎంఎస్ఐడీసీ చీఫ్ ఇంజనీర్ శశిధర్ ఆదేశించారు. సంగారెడ్డి రాజంపేట రోడ్డులో నిర్మిస్తున్న ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణ పనుల్లో జాప్యంపై 'గడువులోపు.. గగనమే' అనే శీర్షికతో ఈ నెల 3న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ఆయన గురువారం కళాశాల, హాస్టల్ భవనాల నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని, సాధ్యమైనంత తొందరగా పూర్తిచేసి అప్పగించాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పనుల పురోగతిని తమకు నివేదించాలని సూచించారు. ఆయన వెంట ఈఈ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

500 పడకల ఆస్పత్రి పనులు షురూ

సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన 500 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం పాత భవనాల కూల్చివేత పనులు గురువారం మొదలయ్యాయి. రూ.273.4 కోట్ల నిధులతో నూతన ఆస్పత్రి భవన నిర్మాణానికి సెప్టెంబరు 4న మంత్రి దామోదరరాజనర్సింహ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. టీజీఎంఎస్ఐడీసీకి నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. నూతన ఆస్పత్రి భవన నిర్మాణంలో భాగంగా పాత భవనాల కూల్చివేతలు అనివార్యమయ్యాయి. మెడికల్‌వార్డు, ఆపరేషన్ థియేటర్, రేడియాలజీహబ్, టీ-హబ్, పాత క్యాజువాలిటీ, ఆర్‌టీపీసీఆర్ ల్యాబ్ తదితర భవనాలు కూల్చివేయనున్నారు. ఇదే ఆస్పత్రి ప్రాంగణంలో తాత్కాలికంగా పక్కాగా షెడ్లు నిర్మించి ఆయా విభాగాలు, వార్డులు తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులు సైతం మొదలయ్యాయి. నాలుగంతస్తుల్లో నిర్మించనున్న నూతన ఆస్పత్రి భవనాన్ని ఏడాదిన్నర కాలంలో పూర్తి చేస్తామని టీజీఎంఎస్ఐడీసీ ఈఈ రవీందర్‌రెడ్డి తెలిపారు.

ఆలయ భూమి అన్యాక్రాంతం

- 25 ఏళ్లుగా మహంకాళి గుడి స్థల వివాదం
- కోర్టులో కేసు వేసిన దేవాదాయశాఖ
- స్థలం స్వాధీనం చేసుకోవాలని ఏడేళ్ల క్రితం తీర్పు
- హైకోర్టుకు వెళ్లిన దుకాణాదారులు



వివాదాస్పద స్థలాలంలో నిర్మించిన దుకాణ సముదాయం

రామాయంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట పట్టణంలో మహంకాళి ఆలయానికి ఓ భక్తుడు ఇచ్చిన రూ. కోట్లు విలువైన భూమి కబ్జాల పాలయ్యింది. 1676 సర్వే నంబర్‌లో 53 గుంటల భూమిని దశాబ్దాల క్రితం ఓ భక్తుడు మహంకాళి ఆలయానికి విరాళంగా ఇచ్చాడు. అప్పట్లో ఆలయం చిన్నగా ఉండగా భక్తుడు ఇచ్చిన స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. ఆ తరువాత నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని కొందరు తమ పేరిట మార్చు కున్నారు. ఆలయానికి భక్తుల రాక పెరగడంతో ఆ స్థలానికి డిమాండ్ పెరిగింది. ఆక్రమించిన ఒక్కొక్కటిగా సదరు స్థలంలో 30 దుకాణాలను నిర్మించారు. దాత ఇచ్చిన స్థలంలో 20 గుంటలు మాత్రమే మిగలగా ఆలయ కమిటీ అంచెలంచెలుగా 48 దుకాణాలను నిర్మించింది. దుకాణాల అద్దె రూపంలో ఆలయానికి ఆదాయం మొదలైంది. దీంతో 1997లో ఆలయాన్ని దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకున్నారు. ఆలయ రికార్డులను స్వాధీనం చేసుకున్న అనంతరం పరిశీలించగా దాత ఇచ్చిన భూమిలో 28 గుంటలు అన్యాక్రాంతమైనట్లు గుర్తించింది. అప్పటికే సదరు స్థలంలో దుకాణాలు నిర్మించుకోవడంతో దేవాదాయశాఖ కోర్టులో కేసు వేసింది. విచారణ అనంతరం ఆలయ భూమిలోని ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ఏడేళ్ల క్రితం ట్రిబ్యునల్ తీర్పు వచ్చింది. ఈమేరకు అధికారులు ఆక్రమణదారులకు నోటీసులను అందజేశారు. దీంతో, దుకాణదారుల్లో 16 మంది హైకోర్టును ఆశ్రయించడంతో స్వాధీనం చేసుకోకుండా స్టే విధించింది. దీతో కోట్లాది రూపాయల విలువైన భూములు వివాదాస్పదంగానే మిగిలాయి.

ఎస్టీ గురుకులంలో
విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- ప్రిన్సిపాల్‌ను నిలదీసిన తల్లిదండ్రులు



విద్యార్థి వీపుపై వాతలు

కంగ్టి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్టడీ అవర్స్‌లో నవ్వినందుకు కోపంతో ఏడో తరగతి విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదిన ఘటన సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర గురుకుల విద్యాలయంలో ఆలస్యంగా గురువారం వెలుగు చూసింది. విద్యార్థి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గాజుల్‌పాడ్ టోపా తండాకు చెందిన లలితా బాయి, నాందేవ్‌ల కుమారుడు శ్రీకాంత్ ఎస్టీ గురుకులంలో ఏడో తరగతి చదువుతున్నాడు. చదువులో చురుకైనా విద్యార్థిగా గురుకులంలో మంచి పేరుంది. మంగళవారం స్కూల్‌లో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న సమయంలో అకారణంగా నవ్వుతున్నాడని కోపంతో ఇంగ్లిష్ బోధకుడు సుదర్శన్ విద్యార్థిని వీపుపై చితకబాదాడని తల్లిదండ్రులు ఆరోపించారు. గురువారం విద్యాలయానికి వచ్చిన విద్యార్థి తల్లిదండ్రులు బాలుడి వీపుపై వాపు చూసి ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేశారు. పిల్లలు తప్పు చేస్తే మందలించాలి కానీ కర్కషంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ అకారణంగా ఆంగ్లం ఉపాధ్యాయుడు సుదర్శన్ విద్యార్థిని చితకబాదిన విషయం వాస్తవమేనని అన్నారు. విద్యార్థి ఉపాధ్యాయుడి పట్ల దురుసుగా మాట్లాడడంతో ఒక్కటే కొట్టాడని తెలిపారు. మరోసారి ఇలాంటి ఘటన జరుగకుండా చూస్తామని తెలిపారు.



నందికంది సబ్ సెంటర్‌కు 'ఎన్‌క్వాస్'

సంగారెడ్డి అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని నందికంది ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (హెల్త్ సబ్‌సెంటర్) జాతీయ నాణ్యతా ప్రమాణాలకు (ఎన్‌క్వాస్-నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్) ఎంపికైంది. వర్చువల్ అసెస్‌మెంట్‌లో భాగంగా గత నెల 15న సబ్ సెంటర్‌ను కేంద్ర బృందం సభ్యులు సందర్శించి ఏడు అంశాలను పరిశీలించారు. గురువారం వెల్లడించిన ఫలితాల్లో 92.69 శాతం స్కోర్‌తో జాతీయ నాణ్యత ప్రమాణాలకు ఎంపిక చేశారు. ఎన్‌క్వాస్ అవార్డు పొందిన నందికంది సబ్ సెంటర్‌కు ప్రోత్సాహక నగదు దక్కనుంది.

కాలువల కబ్జా.. రాజకీయ దర్జా

కాలువ మూసి రోడ్డు వేసి ప్రభుత్వ భూమి ఆక్రమణ
నాయకుల పేరుతో అధికారుల వసూళ్ల పర్వం



చిట్కుల్ కాలువ ఎగువన వెలసిన నిర్మాణాలు

పటాన్‌చెరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఇస్నాపూర్ పురపాలక సంఘం పరిధిలోని చిట్కుల్ గ్రామం కబ్జాలకు కేంద్రంగా మారింది. 286 సర్వే నంబరులోని 4.7 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాల బారినపడి పూర్తిగా మాయమైంది. కాలువను పూడ్చేసి మరో రెండున్నర ఎకరాలు ఆక్రమించారు. పక్కనే ఉన్న ప్రైవేటు భూమి సర్వే నంబర్లు వేసి విక్రయిస్తున్నారు. ఇందుకు కొందరు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారని ఆరోపణలున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన నీటిపారుదలశాఖ అధికారులు మామూళ్ల మత్తులో కాలయాపన చేస్తున్నారు. మరో అడుగు ముందుకువేసి సదరు స్థలం కాలువ పరిధిలోకి రాదంటూ ఎన్‌వోసీ సైతం జారీ చేసినట్టు తెలుస్తున్నది. ఇందుకు ఓ డివిజన్‌స్థాయి అధికారి చక్రం తిప్పి పెద్దఎత్తున డబ్బులు వసూళ్లు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఎన్‌వోసీ ఆధారంగా నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడానికి మున్సిపల్ అధికారులు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. పక్కనే ఉన్న ఇదే సర్వే నంబర్‌లోని అసైన్డ్ భూమిలో లేఅవుట్ వేసి ఇష్టారీతిన అమ్మకాలు జరిపారు. రూ.60కోట్లు విలువయిన ఈ భూమి విషయంలో రెవెన్యూ అధికారులు కొందరు అక్రమార్కులకు సహకరించినట్లు తెలుస్తోంది. కాలువకు ఆనుకొని విల్లాల నిర్మాణాలు, బేస్‌మెంట్ల నిర్మాణాలు జరిగాయి. అధికార పార్టీకి చెందిన నాయకులు, ఇద్దరు రెవెన్యూ అధికారులను వాటాదారులుగా చేర్చుకుని కీలకమైన పాత్ర పోషించారని ప్రచారం జరుగుతోంది. ఇటీవల బదిలీ అయిన డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారి తమవంతు సహకారం అందించారన్న ప్రచారం జరుగుతోంది.

ఇసుక చోరీకి పాల్పడుతున్న వ్యక్తి రిమాండ్

నంగునూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నంగునూరు పెద్దవాగు నుంచి ఇసుక దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు రాజగోపాల్‌పేట ఎస్సై వివేక్ తెలిపారు. నంగునూరు చెందిన కందికట్ల పర్శరాములు దొంగతనంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. ఇసుక దొంగతనం విషయంలో పంచనామ నిర్వహించి నిందితుడి పై సుమోటో కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. మండలంలోని పెద్దవాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక ను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ వివేక్ హెచ్చరించారు.

సిర్గాపూర్ ఉన్నత పాఠశాలలో పోలీసుల అవగాహన సదస్సు

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, సెల్‌ఫోన్‌ల ద్వారా ఆడపిల్లలకు కలిగే అనర్థాలపై గురువారం సిర్గాపూర్ ఎస్సై మహేష్ అవగాహన కల్పించారు. సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ సదస్సులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌ల ద్వారా ఎన్ని లాభాలు ఉన్నాయో, అంత కంటే ఎక్కువ నష్టాలు ఉన్నాయని అన్నారు. ఫోటోల మార్ఫింగ్‌లు, లింకులు టచ్ చేయడంతో డబ్బులు కొట్టేయడం, ఇలా అనేక రకాలుగా సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారని, వీటికి విద్యార్థులు ముఖ్యంగా ఫోన్‌లకు బాలికలు దూరంగా ఉండాలని, త్వరలోనే పరీక్షలు ఉన్నందున చదువు పట్ల దృష్టి పెట్టాలని ఎస్సై మహేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో సిర్గాపూర్ ఎంఈఓ నాగారం శ్రీనివాస్, హెచ్ఎం లక్ష్మణ్, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాయనమ్మ మందలించిందని ఆత్మహత్య



కరుణాకర్ (ఫైల్)

కొండపాక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏం పని చేయడం లేదని నాయనమ్మ మందలించడంతో మనవడు ఉరేసుకుని ఆత్మహత్య పాల్పడిన సంఘటన కొండపాకలో గురువారం చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... కొండపాక గ్రామానికి చెందిన తడకపల్లి కరుణాకర్(27) తన తల్లిదండ్రులు మృతి చెందడంతో నాయనమ్మ లచ్చవ్వతో కలిసి ఉంటున్నాడు. కరుణాకర్ ఇంటి నిర్మాణం కోసం ప్రైవేట్ బ్యాంకులో తొమ్మిది లక్షల రూపాయలు రుణం తీసుకున్నాడు. ప్రతినెల 14 వేల రూపాయలు బ్యాంక్‌కు వాయిదాలు చెల్లిస్తున్నాడు. ఏం పని లేకపోవడంతో నెల నెల కట్టాల్సిన సొమ్ము ఎలా అని నాయనమ్మ లచ్చవ్వ బుధవారం రాత్రి మందలించింది. నెలరోజుల నుంచి నీవు ఏ పనికి పోవడం లేదు నా ఆరోగ్యం బాగాలేదు, ఇంటికి సంబంధించిన రుణం ఎలా కడతావని మందలించింది. అదే రాత్రి లచ్చవ్వ గ్రామంలో ఉన్న మనవరాలు ఇంటికి వెళ్లింది. కలత చెందిన కరుణాకర్ రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఉదయం చూసేసరికి వేలాడుతూ కనబడ్డాడు. మృతుడి సోదరి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మోటార్‌సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి



సర్దార్ తులసీ సింగ్ (ఫైల్)

పటాన్‌చెరు నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని మోటారుసైకిల్ ఢీకొని దుర్మరణం పాలయిన సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఐడీఏబొల్లారం పట్టణం అంబేడ్కర్ కాలనీలో ఉంటున్న సర్దార్ తులసీ సింగ్ (38) గురువారం ఉదయం ఔటర్ సర్వీస్‌రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి బచ్చుగూడ కు చెందిన మౌనేందర్‌రెడ్డి మోటారుసైకిల్‌పై వచ్చి ఢీకొట్టాడు . బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. బాచుపల్లిలోని మమత ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. ఈ మేరకు భార్య సర్దార్ దేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నకిలీ గన్ కలకలం



నకిలీ సీజర్ గన్‌ను చూపుతున్న మెదక్ రూరల్ సీఐ జార్జ్

హవేళిఘణపూర్ నవంబరు 6, (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ యువకుడు నకిలీ గన్‌తో బెదిరించిన ఘటన మండలంలో గురువారం కలకలం రేపింది. మెదక్ రూరల్ సీఐ జార్జ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన హవేళిఘణపూర్ శివారులో మాజీ సైనికుడికి విల్సన్ గ్రామానికి చెందిన ఎల్లానికి భూవివాదం 20 ఏళ్లుగా కొనసాగుతోంది. ఈ కేసు కోర్టులో కూడా ఉంది. కాగా ఎల్లం కోర్టుకి వెళ్లి స్టే తీసుకువచ్చాడు. గురువారం ఉదయం ఎల్లం కబ్జాలోకి వెళ్లేందుకు యత్నించాడు. నాగాపూర్‌కు చెందిన భూమి యజమాని కొడుకు నీలేశ్వర్, మోహన్ తన స్నేహితులతో కలిసి అక్కడికి చేరుకుని లైటర్ పిస్తల్ చూపి కాల్చివేస్తామని ఎల్లాన్ని బెదిరించాడు. వెంటనే ఎల్లం 100 కు సమాచారం అందించాడు. వెంటనే స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. దానిని పరిశీలించగా లైటర్ పిస్తల్ అని తేలింది. దీనిని ఫ్లిప్‌కార్టులో కొనుగోలు చేసినట్లు విచారణలో తేలింది. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బలవంతపు భూసేకరణ నిలిపివేయాలి

పటాన్‌చెరు నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల నుంచి బలవంతంగా జరుపుతున్న భూసేకరణ నిలిపివేయాలని సీపీఎం కార్యదర్శి నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఇంద్రేశం పురపాలక పరిధి చిన్నకంజర్ల గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేనంబర్లు 113 లో 160మంది రైతులకు చెందిన 180 ఎకరాల భూమిని 40 ఏళ్లుగా సాగు చేసుకుంటూ రైతులు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా ప్రభుత్వం వ్యవహరించి రైతులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు.

జాతీయ సాహస శిబిరానికి తారా విద్యార్థిని


శేరి శ్రీవిద్య

సంగారెడ్డి అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సాహస శిబిరానికి సంగారెడ్డిలోని తారా డిగ్రీ కళాశాల విద్యార్థిని శేరి శ్రీవిద్య ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో ఈ నెల 9 నుంచి 19 వరకు నిర్వహించనున్న శిబిరంలో ఆమె పాల్గొననున్నారు. ఓయూ నుంచి ఐదుగురు ఎంపిక కాగా అందులో తమ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎంపికకావడం గర్వకారణమని ప్రిన్సిపాల్ ప్రవీణ తెలిపారు. విద్యార్థిని అధ్యాపక బృందం అభినందించింది.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు సిద్దిపేట జిల్లా విద్యార్థులు

ములుగు/మద్దూరు/నంగునూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయిలో నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన సిద్దిపేట జిల్లాకు చెందిన పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 4న తూప్రాన్‌లో నిర్వహించిన ఖోఖో పోటీల్లో ములుగు మండలంలోని క్షీరాసాగర్ జడ్పీహెచ్ఎస్ బాలికలు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన భార్గవి, అరుణ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పెద్దపల్లిలో నిర్వహిస్తున్న 58వ రాష్ట్ర స్థాయి సీనియర్ ఖోఖో చాంపియన్ షిప్‌లో వీరు ప్రాతినిధ్యం వహిస్తారని ప్రధానోపాధ్యాయులు బండ రవికుమార్ తెలిపారు. బాలికలను ఉపాధ్యా బృందంతో పాటు కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీ కొన్యాల మమతాబాల్‌రెడ్డి అభినందించారు. సెప్టెంబరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాలురు, బాలికల విభాగంలో ప్రతిభ కనబర్చిన మద్దూరు మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కోస్గిలో జరగనున్న పోటీల్లో బానోతు ఐశ్వర్య, పోకల మాన్యత, తాళ్లపల్లి సింధు, సలాది ఆదిత్య పాల్గొంటారని పేర్కొన్నారు. సాఫ్ట్‌బాల్ బాలికల విభాగంలో రాణించిన నంగునూరు మండలం గట్ల మల్యాల జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఐదుగురి విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రమేష్ తెలిపారు. పాఠశాలకు చెందిన బి.ప్రియా, బి.హరిణిప్రియ, అఖిల బి.అశ్విని, ఎం.వైష్ణవి జగిత్యాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థినులు, పీడీ రాజ్‌కుమార్‌ను పాఠశాల కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

కళా ఉత్సవ్ పోటీలకు ఖేడ్ విద్యార్థులు ఎంపిక

నారాయణఖేడ్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఖేడ్‌లోని ఈ తక్షిలా పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ శరత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థుల్లో రోజలిన, సుప్రియ, సంయుక్త, అక్షర, కృష్ణవేణి, శ్రీ చైతన్య, వర్షిణి, సాయిస్ఫూర్తి, అనిల్, నిఖిల్, చక్రధర్, ధనూష్ ఉన్నారని పేర్కొన్నారు. వారిని కరస్పాండెంట్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్ఈఐఎల్ యాత్రకు మనోహరాబాద్ యువకుడు


చెలిమెల ధృహన్

మనోహరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక జాతీయ సమైక్యత యాత్రకి ఏబీవీపీ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షుడు ధృహన్ ఎంపికయ్యాడు. మనోహరాబాద్ మండలం కేంద్రానికి చెందిన చెలిమెల ధృహన్ ఉస్మానియా యూనివర్సిటీలో ఏబీవీపీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. స్టూడెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇన్ ఇంటర్‌స్టేట్ లివింగ్ పేరుతో దేశ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి దేశ నలుమూలల నుంచి 70 మంది ఎంపిక కాగా, తెలంగాణ నుంచి ధృహన్ వెళ్లనున్నాడు.


చెర్లగూడెంలో విరగపూసిన బంతిపూల తోట

పూల తోట.. సిరుల బాట!

బంతిపూల సాగు వైపు రైతుల ఆసక్తి

హైదరాబాద్ మార్కెట్ అందుబాటుతో పెరిగిన డిమాండ్

ఎకరానికి రూ.5 లక్షల వరకు లాభం

కంది, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంప్రదాయ పంటలైన వరి, పత్తి సాగులో తరచూ నష్టాలను చవిచూస్తున్న రైతులు ఇప్పుడు ఉద్యాన, వాణిజ్య పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లాలోని కంది మండల రైతులు, పత్తిలో ఆశించిన దిగుబడి రాక నిరాశ చెందుతుండడంతో, అధిక లాభాలు వచ్చే మిరప, ఉల్లి, కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తోటలతో పాటు వివిధ రకాల పూల తోటలు పెంచుతున్నారు. బంతి, చామంతి, గులాబీ తదితర పూల పంటను సాగుచేస్తున్నారు. హైదరాబాద్ మార్కెట్ దగ్గరగా ఉండడం, రవాణా ఖర్చులు తగ్గడం కూడా ఈ సాగుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

లాభాల బాటలో బంతి సాగు

కంది మండలంలోని జుల్‌కల్, తోపుగొండ, చెర్లగూడెం, కలివేముల, ఉత్తర్‌పల్లి, ఎద్దుమైలారం వంటి గ్రామాల్లో ఆరు నెలల కాలంలో చేతికి వచ్చే బంతిపూల పంటను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. ఒకే రకం పంటలు కాకుండా, వివిధ రకాల వాణిజ్య పంటలు సాగు చేయడం వల్ల భూసారం పెరిగి దిగుబడి అధికంగా వస్తుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. బంతి పూల సాగు ఇతర పంటల కన్నా లాభదాయకంగా ఉందని రైతులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ సహకారం అందితే, పూల సాగు విస్తీర్ణం మరింత పెంచడానికి అవకాశం ఉందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


విత్తనాల కోసం ఎండబెట్టిన పూలు

మార్కెట్‌లో భలే డిమాండ్

రాష్ట్రవ్యాప్తంగా వినాయక చవితి, బతుకమ్మ పండుగల నుంచే బంతిపూలకు డిమాండ్ బాగా పెరిగింది. దసరా, దీపావళి, కార్తీకమాసం పూజలతో పాటు, జనవరి 15 వరకు కొనసాగే అయ్యప్పస్వామి పూజలకు బంతిపూలను ఎక్కువగా వినియోగిస్తారు. అంతేకాక, పెళ్లిళ్లు, శుభకార్యాలు, గృహ ప్రవేశాల వంటి సందర్భాల్లోనూ బంతిపూలకే ప్రాధాన్యం ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో బంతిపూలు రూ.50 నుంచి రూ.120 వరకు అమ్ముడవుతున్నాయి

పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ

నాణ్యమైన బంతిపూల విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తే, ఎకరానికి దాదాపు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుంది. వాతావరణ పరిస్థితులను బట్టి, ఈ పంట నాలుగు నుంచి ఆరు నెలల్లో కోతకు వస్తుంది. ఒకసారి పూలు రావడం మొదలైతే, దాదాపు మూడు నుంచి ఆరు నెలల వరకు రోజు మార్చి రోజు కోయవచ్చు. దీని ద్వారా ఎకరానికి రూ.లక్ష పెట్టుబడితో రూ.3లక్షల నుంచి రూ.5 లక్షల వరకు లాభం ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

బంతిపూల సాగు పద్ధతి...

బంతిపూల సాగుకు భూమిని సిద్ధం చేసి, విత్తనాలు లేదా 20 రోజుల వయస్సు గల మొలకలను నాటాలి. మొక్కలకు 20 సెం.మీ.ల దూరం ఉండేలా చూసుకోవాలి. ఎకరానికి 20 నుంచి 40 కిలోల నత్రజని, 80 కిలోల ఫాస్పరస్ వంటి ఎరువులు వాడాలి. సాగుకు ముందు బాగా చిలికిన పశువుల ఎరువును నేలలో కలిపి వేయడం మంచిది. విత్తనాలను ప్రోట్రేలలో లేదా నేరుగా పొలంలో నాటవచ్చు. అక్టోబరు నుంచి ఏప్రిల్ వరకు పూల సరఫరా కోసం జూలై మొదటి వారం నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు నాటడం అనువైన సమయం. మొక్కలకు సకాలంలో నీరు పెట్టి, కలుపు తీయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చు.

విత్తనాలకు ప్రభుత్వ సబ్సిడీ ఇస్తే బాగుంటుంది



ఇతర పంటల కన్నా బంతి పూల సాగు లాభసాటిగా ఉంది. చెర్లగూడెంలో ఎకరం పొలంలో బంతి నారు తెచ్చి నాటాను. పంట ఏపుగా పెరగడంతో దిగుబడి అధికంగా వస్తోంది. మార్కెట్లో కిలో రూ.50 నుంచి రూ.80 వరకు ధర వస్తోంది. పూల తోటలకు కావలసిన విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తే బాగుంటది.

- హన్మయ్య, రైతు, చెర్లగూడెం

తక్కువ ఖర్చు.. ఎక్కువ ఆదాయం

బంతిపూల పంటల సాగులో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఉంటాయి. కరువు సమయంలో కూడా ఆదాయం సంపాదించడానికి, ప్రణాళికాబద్ధంగా సాగుచేయాలి. విత్తనాలు కొనేటప్పుడు, మొక్కలు నాటిన తర్వాత చీడపీడల పట్ల జాగ్రత్తలపై ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలి. అధిక దిగుబడి కోసం సాగు పద్ధతులు పాటించాలి. ముఖ్యమైన పండుగలకు, శుభకార్యాలకు అనుగుణంగా సాగు ప్రణాళికలు రూపొందించాలి.

-శైలజ, ఉద్యానవన శాఖ అధికారి


తోపుగొండలో బంతి సాగును పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి శైలజ (ఫైల్)

కంగ్టిలో సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం


సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ మారుతిరెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కంగ్టి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కంగ్టిలో ప్రభుత్వ సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. 'మద్దతు ఉత్తదేనా?' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. కంగ్టి పీఏసీఎస్ వద్ద చైర్మన్ మారుతిరెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.5328 క్వింటాల్ చొప్పున కొనుగోలు చేయనున్నామని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి రమేష్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ రోడ్లపై వ్యాపారాలు చేయొద్దు

పోలీసులు, అధికారుల సూచన


వ్యాపారులతో మాట్లాతున్న పోలీసులు, అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గజ్వేల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ రోడ్లపై వ్యాపారాలు నిర్వహించొద్దని వీధి వ్యాపారులు, చిరువ్యాపారులకు అధికార యంత్రాంగం సూచించింది. నగం రోడ్డు సంతకే శీర్షికన రెండు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో మార్కెట్ సౌకర్యం ఉన్నా రహదారుల పైనే అమ్మకాలు చేపడుతున్నారనే కథనానికి స్పందించారు. కూరగాయలు, తోపుడు బండ్లు, పండ్లు, ఇతర సామగ్రి విక్రయించే వారికి గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా నుంచి డిలీవాలా హోటల్ వరకు, మార్కెట్ రోడ్డు, మెయిన్ రోడ్డు, తూప్రాన్ రోడ్డులో రోడ్డుపై వ్యాపారాలు నిర్వహించద్దని, సైన్‌బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. కూరగాయల వ్యాపారులు, పండ్ల వ్యాపారులు, చిరు వ్యాపారులు సమీకృత మార్కెట్‌లో తమ ఉత్పత్తులను విక్రయించుకోవాలని సూచించారు. గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి. రవి కుమార్, ట్రాఫిక్ సీఐ మురళీ, మునిసిపల్ కమిషనర్ చెట్లపల్లి బాలకృష్ణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్‌వెస్లీ, ఎస్ఐలు రఘుపతి, నీరేశ్ తదితరులున్నారు.

అట్టహాసంగా గురుకుల జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



మెదక్‌లో జ్యోతి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్, జోనల్ ఆఫీసర్ ప్రత్యూష, హత్నూర అంబేడ్కర్ కళాశాలలో జోన్-6 క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్

మెదక్ అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : మెదక్ పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం 11వ రాష్ట్రస్థాయి జోనల్ స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, మెదక్ జిల్లాలకు చెందిన గురుకుల క్రీడాకారులు 1,105 మంది హాజరయ్యారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, జోనల్ ఆఫీసర్ ప్రత్యూష క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ముందుగా జాతీయ, ఒలింపిక్స్, సొసైటీ జెండాలను ఆవిష్కరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్‌ను నిర్వహించారు. విద్యార్థినుల నృత్యప్రదర్శన ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో మూడు జిల్లాల గురుకులాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. అండర్- 14, 17, 19 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, లాంగ్‌జంప్, హైజంప్, క్యారమ్, హ్యాండ్ బాల్, రన్నింగ్, బాల్‌బ్యాడ్మింటన్, డిస్కస్‌త్రో, చెస్, అథ్లెటిక్స్ పోటీల జరుగనున్నాయి. తొలిరోజు అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. 8 వరకు క్రీడలు కొనసాగనున్నాయి.

హత్నూర గురుకుల విద్యాలయంలో

హత్నూర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): హత్నూర డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో 11వ జోనల్ స్థాయి(జోన్-6) క్రీడోత్సవాలను గురువారం గురుకుల విద్యాసంస్థల డిప్యూటీ సెక్రటరీ రజిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హత్నూర తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, జిన్నారం సీఐ రమణారెడ్డి, హత్నూర ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, హోప్ న్యూరో హాస్పిటల్ ఎండీ డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ ఆనంద్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీకాంత్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

కొండపాక జ్యోతబాపూలే పాఠశాలలో

కొండపాక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొండపాక మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాల ఆవరణలో గురుకుల పాఠశాలల ఉమ్మడి మెదక్ జిల్లా స్పోర్ట్స్ మీట్ గురువారం ప్రారంభమైంది. రాష్ట్ర బీసీ వెల్ఫేర్ సెక్రెటరీ బడుగు సైదులు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ జి.తిరుపతి, శ్యామ్‌ప్రసాద్‌లాల్, ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్సీవో రాజేశం, సిద్దిపేట జిల్లా కన్వీనర్ బి.గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేరళను చూసైనా గుణపాఠం నేర్చుకోవాలి

- స్థానిక ఎన్నికలు త్వరగా నిర్వహించాలి
- సీపీఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి


మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పేదరికం లేని రాష్ట్రంగా కేరళ దేశానికి ఆదర్శవంతంగా నిలిచిందని, ఆ రాష్ట్రాన్ని చూసైనా ప్రధాని మోదీ గుణపాఠం తెచ్చుకోవాలని సీపీఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు. 73, 74 రాజ్యాంగ సవరణ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన ఐదు నెలలల్లోపు మళ్లీ నిర్వహించాలని, కేరళలో తూచ తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. కానీ రాష్ట్రంలో 20 నెలలు దాటినా ఎన్నికలు నిర్వహించకపోవడం తగదన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల చట్టం అమలు కోసం ప్రధాని మోదీ వద్దకు అఖిలపక్ష పార్టీలను తీసుకెళ్లి ఒత్తిడి తేవాలన్నారు. వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని లేనట్లయితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని సూచించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి సీపీఐ మద్దతు ఇస్తున్నదని వెల్లడించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ పేదలను పోలింగ్ కేంద్రాల వద్దకు రాకుండా చూడాలని వ్యాఖ్యానించిన కేంద్ర మంత్రి లలన్ సింగ్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ వంద సంవత్సరాల ముగింపు బహిరంగ సభను డిసెంబరు 26వ తేదీన ఖమ్మంలో నిర్వహిస్తున్నామని, దీనికి 40 దేశాల నుంచి కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. మావోయిస్టులతో సహా అన్ని ఎర్రజెండా పార్టీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కాలవేని శంకర్, జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, హన్మకొండ, కరీంనగర్ జిల్లా కార్యదర్శులు కర్రె బిక్షపతి, పంజాల శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ తదితరులున్నారు.

నకిలీ పత్తి విత్తనాలతో నట్టేట మునిగిన రైతు


ఖాత లేని పత్తి చేను చూపిస్తున్న రైతు వెంకటయ్య

మద్దూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నకిలీ పత్తి విత్తనాలతో ఓ రైతు మోసపోయిన ఘటన మద్దూరులో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన రైతు బెల్లి వెంకటయ్య 45 ఏళ్లగా వ్యవసాయం చేస్తున్నాడు. సాధారణంగా జనగామ జిల్లా కేంద్రం నుంచి పత్తి విత్తనాలు తెచ్చుకునేవాడు. ఈసారి మద్దూరులోని శ్రీరామ ఫర్టిలైజర్ షాపు యజమాని సంపత్ 'నంబర్ ఏక్ విత్తనాలు ఇస్తానని నమ్మబలకడంతో అక్కడే కొనుగోలు చేశాడు. వెంకటయ్య పలు రకాల విత్తనాలను కలిపి మొత్తం 18 ప్యాకెట్లు తీసుకుని 5 ఎకరాల్లో సాగు చేశాడు. పత్తి మొక్క ఆరు అడుగుల ఎత్తు పెరిగినా కాయ మాత్రం రాలేదని వాపోయారు. మొత్తం 5 ఎకరాల్లో పది క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదని, దీంతో తాను నిండా మునిగానని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో ఎకరానికి 1.20 లక్షలు ఖర్చు చేసినట్లు, కూలీలకు మాత్రమే రూ.60 వేలు ఖర్చయ్యాయని ఆయన వివరించారు.

దిగుబడి లేకపోవడంతో ఆవేదన చెందిన వెంకటయ్య, పత్తి మొక్కలతో సహా ఫర్టిలైజర్ షాపు వద్దకు వెళ్లి యజమాని సంపత్‌ను నిలదీశారు. దీనికి సంపత్, పొలానికి వచ్చి పరిశీలించాల్సి ఉంటుందని, కంపెనీ విత్తన సరఫరాదారులకు సమాచారం అందించానని, వారు వచ్చి చూశాక చెబుతానని దాటవేస్తున్నట్లు వెంకటయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లేని విత్తనాలతో నష్టపోయినందుకుగాను తనకు నష్టపరిహారం కట్టివ్వాలని వెంకటయ్య డిమాండ్ చేస్తున్నారు. ఫర్టిలైజర్ షాపుల తనిఖీలు నామమాత్రంగా జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. నకిలీ విత్తనాలతో రైతులు మోసపోతున్న నేపథ్యంలో, వ్యవసాయశాఖ, పోలీస్ అధికారులు వెంటనే ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ముదిమాణిక్యం పాఠశాలలో క్షుద్రపూజల కలకలం

- మూఢనమ్మకాలని కాళ్లతో చెరిపివేసిన హెచ్‌ఎం
- తరగతులకు హాజరుకాని విద్యార్థులు


నక్షత్ర ఆకారంలో గీసిన పటం

పుల్‌కల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని ముదిమాణిక్యం పాఠశాల ప్రాంగణంలో జరిగిన క్షుద్రపూజల సంఘటన గురువారం కలకలం సృష్టించింది. బుధవారం రాత్రి కార్తీక పౌర్ణమి సందర్భంగా గుర్తు తెలియని వ్యక్తులు జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలు ఉన్న ఒకే ప్రాంగణంలో నక్షత్ర ఆకారంలో ముగ్గులు వేసి, పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, దిష్టిబొమ్మలు ఉంచారు. ఉదయం పాఠశాల ప్రధాన ద్వారం వద్దకు వచ్చిన పారిశుధ్య కార్మికురాలు స్వరూప ఈ దృశ్యాన్ని చూసి భయపడి తాళం తీయలేకపోయింది. విషయం గ్రామస్థులకు తెలియడంతో తల్లిదండ్రులు, గ్రామస్థులు పాఠశాల వద్దకు భారీగా తరలి వచ్చారు. భయంతో విద్యార్థులు బయటే ఉండిపోగా, విధులకు హాజరైన ఉపాధ్యాయులను కూడా లోపలికి వెళ్లొద్దంటూ గ్రామస్థులు వారించారు. అప్పుడే వచ్చిన ప్రధానోపాధ్యాయుడు మాధవరెడ్డి ఈ పరిణామాలను గమనించి, మూఢనమ్మకాలను నమ్మవద్దంటూ నచ్చజెప్పారు. అనంతరం సీసీ రోడ్డుపై ఉన్న పటం, పూజా సామగ్రిని కాళ్లతో చెరిపివేసి, గ్రామపంచాయతీ నుంచి ట్యాంకర్‌ను తెప్పించి ప్రాంగణాన్ని శుభ్రం చేయించారు. అయినా తల్లిదండ్రులు భయంతో తమ పిల్లలను వెంటబెట్టుకొని ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో గురువారం పాఠశాల తరగతులు జరగలేదు. పాఠశాల ప్రాంగణంతో పాటు గ్రామానికి నలుదిక్కుల రహదారులపైనా పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, టెంకాయలను వస్త్రంలో కట్టి ఉంచడం స్థానికుల్లో మరింత ఆందోళన పెంచింది. హెచ్‌ఎం మాధవరెడ్డి ఎంఈవో శంకర్, డీఈవో వెంకటేశ్వర్లుకు సమాచారం అందించారు. ఘటన గురించి తెలుసుకున్న పుల్కల్ ఎస్సై విశ్వజన్ పాఠశాలను సందర్శించి, హెచ్‌ఎం మాధవరెడ్డితో మాట్లాడారు. ఆకతాయిలు ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి పనులు చేస్తుంటారని, ప్రజలు మూఢనమ్మకాలను నమ్మవద్దని, విద్యార్థులు నిర్భయంగా తరగతులకు హాజరు కావాలని ఆయన కోరారు.

రైతులు అంతర్జాతీయస్థాయి మార్కెటింగ్‌తో పోటీపడాలి

సంగారెడ్డి జిల్లా ఫలపరిశోధన సంస్థ శాస్త్రవేత్త డా.సుచిత్ర

జహీరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటలతో అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసేలా పోటీపడాలని సంగారెడ్డి జిల్లా ఫలపరిశోధన సంస్థ శాస్త్రవేత్త డా.సుచిత్ర పేర్కొన్నారు. జహీరాబాద్ రంజోల్‌లోని రైతువేదికలో అల్లం సాగుపై గురువారం జిల్లా స్థాయి సదస్సును నిర్వహించారు. ఉద్యానశాఖ జిల్లా అధికారి పండరి, వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతితో కలిసి పాల్గొన్న ఫలపరిశోధన సంస్థ శాస్త్రవేత్త డా.సుచిత్ర మాట్లాడుతూ రైతులు శాస్త్రీయ, సేంద్రియ పద్ధతులను పాటించడం లేదన్నారు. రసాయనాలను ఎక్కువ మోతాదుల్లో వాడడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో మన పంటలు రిజక్ట్ అవుతున్నాయని విచారం వ్యక్తంచేశారు. మార్కెట్‌కు అనుగుణంగా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జహీరాబాద్ ప్రాంతం వాణిజ్య పంటల సాగుకు యోగ్యమైనదన్నారు. తెలంగాణలో సంగారెడ్డి, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో అల్లం పెద్దమొత్తంలో సాగవుతుందన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రాజేందర్‌నగర్ విద్యార్థులు చేపట్టిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

బ్రహ్మోత్సవాలకు రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయం ముస్తాబు


ఆలయానికి వేసిన రంగులు

కంది, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఏటా కార్తీకమాసం రెండో వారంలో నిర్వహించే కందిలోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయ ధర్మకర్తలు దీపక్ దేశ్‌ముఖ్, సునీల్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కందిలోని పురవీధుల్లో లైటింగ్ కోసం పదుల సంఖ్యలో బారికేడ్లు నిర్మించారు. వారం రోజుల పాటు జాతర కొనసాగనున్నది. ఆలయ ధర్మకర్తలు గురువారం కరపత్రాలను విడుదల చేశారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్

సంగారెడ్డి రూరల్/పటాన్‌చెరు నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ విద్యార్థులకు సూచించారు. సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, బీడీఎల్ పరిధిలోని బానూరు స్టేడియంలో మార్నింగ్ వాకర్లకు గురువారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరాల నుంచి బయటపడేందుకు అవగాహన ముఖ్యమన్నారు. ఈజీ మనీ, మల్టీలెవల్ మార్కెటింగ్, ట్రేడింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, డిజిటల్ అరెస్ట్, తక్కువ పెట్టుబడితో వ్యాపారాలు ప్రారంభించవచ్చని, ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు ఆన్‌లైన్ ద్వారా మోసం చేసేందుకు ప్రయత్నిస్తారన్నారు. ఇలాంటి వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 48 గంటల్లోపు 1930 నంబర్‌కు కాల్ చేసి లేదా ఎన్సీఆర్పీ(సైబర్‌క్రైమ్) పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బానూర్ సీఐ విజయ్‌కృష్ణ, సైబర్ క్రైమ్ సీఐ రవి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతుపై కేసు

రామాయంపేట, నవంబర్ 6 (ఆంధ్రజ్యోతి) : వాహనాలకు ఆటంకంగా రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతుపై కేసు నమోదైంది. మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట హైవేపై రైతు ఇప్ప మల్లేశం రెండు రోజుల క్రితం పంట ఆరబోశాడు. బుధవారం రాత్రి రామయంపేట నుంచి మెదక్ వైపు వెళ్తున్న రెండు ప్రయాణికుల ఆటోలు కుప్పలు అడ్డంగా ఉండడంతో అదుపుతప్పి బోల్తాపడ్డాయి. ఈ ప్రమాదంలో 13 మంది గాయాలపాలవగా, స్థానిక ఎస్సై బాలరాజ్ గురువారం ఘటనాస్థలికి వెళ్లి విచారణ చేపట్టారు. వాహనాల రాకపోకలకు ప్రమాదంగా ధాన్యం పోశారని తేలింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు

వైద్యాధికారులు, సిబ్బంది శ్రద్ధగా పనిచేయండి

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య



సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, నవంబరు (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది శ్రద్ధగా పనిచేయాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన 17వ కామన్ రివ్యూ మిషన్ బృందం డీ-బ్రీఫింగ్ సమావేశంలో ఆమె మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా ప్రభుత్వాసుపత్రి, పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రి, నారాయణఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రి, సదాశివపేట పీహెచ్‌సీ, ఆత్మకూరు, కంగ్టి, ఆర్సీపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మార్క్స్‌నగర్‌లోని అర్బన్ పీహెచ్‌సీ, ఇందిరానగర్‌లోని బస్తీ దవాఖానా, ఆయుష్ క్లినిక్‌లను సందర్శించిన సమయంలో ఆయా కేంద్రాల్లో వైద్యసేవలు సరిగ్గా అందడం లేదని ఫిర్యాదు వచ్చాయని, మందుల కొరత ఉన్నదని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేయవద్దని, వైద్యసేవలను మరింత మెరుగుపరచాలని, అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో సీఆర్ఎం బృందం టీమ్ లీడర్, ప్రాంతీయ డైరెక్టర్ డా.అనురాధ మేడోజు, సభ్యులు డా.సంతోస్‌నాయక్, డా.రంజన్‌దాస్, డా.కవితా చౌదరి, సీనియర్ కన్సల్టెంట్ అరుణ్‌శర్మ, డీఎంఅండ్‌హెచ్‌వో నాగనిర్మల, సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే



జగన్నాథ్‌పూర్‌లో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/నాగల్‌గిద్ద, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటకలో జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ప్రమాదంలో మండల పరిధిలోని జగన్నాథ్‌పూర్‌కు చెందిన ముగ్గురు మృతిచెందగా గురువారం ఆ గ్రామానికి వెళ్లి మృతుల కుటుంబాలను పరామర్శించారు. తాను అన్నివిధాలుగా అండగా ఉండడంతో పాటు ప్రభుత్వం నుంచి సహాయ, సహకారాలు అందిస్తామని హామీనిచ్చారు. కాగా మండల పరిధి తుర్కపల్లిలోని రథసుధ, అనంతసాగర్‌లోని సంతోష్‌భవానీ పొదుపు సంఘాల సభ్యులు సత్యమ్మ, పట్లోళ్ల శశికళకు ఎస్ఆర్ఎల్ఎం నిధుల నుంచి స్వయం ఉపాధి కోసం రూ.2 లక్షల చొప్పున మంజూరు కాగా అందుకు సంబంధించిన చెక్కులను సంజీవరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సాయిలు, సంతోష్, మాజీ ఎంపీటీసీ దత్తుగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, జగదీశ్, శివారెడ్డి, సాయిగొండ, తదితరులు పాల్గొన్నారు. అలాగే నాగల్‌గిద్ద మండలం పూసల్‌పాడ్ శివారులో సీసీఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీసీఐ అధికారులు సతీష్ గౌడ్, నాయకులు పండరి, ఎస్ఐ రామక్రిష్ణ తదతరులు పాల్గొన్నారు.

కేసులు పరిష్కారమయ్యేలా చూడండి : జడ్జి



సమావేశంలో మాట్లాడుతున్న కవితాదేవి

జహీరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 15న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ జీ.కవితాదేవి, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ ఖలీల్ పేర్కొన్నారు. గురువారం కోర్టు ఆవరణలో పోలీసులు, న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సాధ్యమైనంత వరకు కక్షిదారులు రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు మాణెన్న, సీఐలు శివలింగం, హన్మంతు, ఎస్ఐలు వినయ్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, నరేష్, పోలీసులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్



మాక్‌డ్రిల్‌లో ఎస్పీ పంకజ్

సంగారెడ్డి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, విధి నిర్వహణలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పరితోష్‌పంకజ్ తెలిపారు. పరిశ్రమల్లో అగ్నిప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో రక్షణ చర్యలపై అవగాహనపై గురువారం జిల్లా పోలీసు, రెవెన్యూ, ఎన్‌డీఆర్ఎఫ్ శాఖల సమన్వయంతో పాశమైలారం పారిశ్రామికవాడలోని అరబిందో ఫార్మా యూనిట్-5 పరిశ్రమలో 'మాక్‌డ్రిల్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానియి ఎస్పీ ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ పరిశ్రమల్లో రక్షణ పరికరాలు కచ్చితంగా ఉంచాలని యాజమాన్యాలకు ఆదేశించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన తక్షణ చర్యలు, సిబ్బంది సురక్షితంగా బయటపడే మార్గాలు, రక్షణ బృందాల సమన్వయం వంటి అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఎన్‌డీఆర్ఎఫ్, ఫైర్ అధికారులు, పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, ఏఆర్ డీఎస్పీ నరేందర్, సీఐలు విజయ్‌కృష్ణ, లాలునాయక్, పరిశ్రమల శాఖ అధికారులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతీ కేసును పారదర్శకంగా దర్యాప్తు చేపట్టాలి



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

అల్లాదుర్గం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై పారదర్శకంగా దర్యాప్తు చేపట్టాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పోలీసులకు ఆదేశించారు. గురువారం అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులు పరిశీలించి, మాట్లాడారు. స్టేషన్ పరిధిలో గల కేడీ, సస్పెక్ట్ రౌడీలపై నిఘా ఉంచాలన్నారు. కేసులు పెండింగ్ లేకుండా పరిశీలించాలని తెలిపారు. కిట్ ఆర్టికల్ నిర్వహణలో పరిశుభ్రత, శ్రద్ధ కనబరిచిన పోలీస్ కానిస్టేబుల్ జితేందర్‌కు రివార్డు మంజూరు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ మొక్కలునాటారు. సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, ఎస్ఐ శంకర్ పాల్గొన్నారు.

రాంనగర్‌లో వివాహిత అదృశ్యం

జహీరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వివాహిత అదృశ్యమైన సంఘటన జహీరాబాద్ పట్టణం రాంనగర్‌లో చోటు చేసుకున్నది. ఎస్ఐ వినయ్‌కుమార్ వివరాల ప్రకారం రాంనగర్‌కు చెందిన జిలనుద్దీన్ భార్య మహాబీష్(19) ఈనెల 5 నుంచి ఇంట్లోంచి వెళ్లి అదృశ్యమైంది. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త జిలానుద్దీన్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యువతి కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు.

మేస్త్రీకాలనీలో యువకుడి అదృశ్యం

జహీరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యువకుడు అదృశ్యమైన సంఘటన జహీరాబాద్ పట్టణంలోని మేస్త్రీ కాలనీలో చోటు చేసుకున్నది. దిలీప్ కాలనీలో నివాసముంటున్నాడు. ఈ నెల 3 నుంచి అదృశ్యమయ్యాడు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య బర్దీపూర్ ఎస్తేర్‌రాణి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సదరు వ్యక్తి కనిపిస్తే సమాచారమందించాలని పోలీసులు తెలిపారు.

అవినీతిపై ఉక్కుపాదం : కలెక్టర్

మెదక్ అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అవినీతిని అంతమొందించి, జిల్లాలో పారదర్శక పాలనే లక్ష్యంగా ముందుకు పోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ఎవరైనా అధికారులు, సిబ్బందికి అవినీతి ఆలోచన ఉంటే విరమించుకోవాలని సూచించారు. అనంతరం అవినీతిపై ఉద్యోగులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో డీఆర్వో భుజంగరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో శ్రీనివాసరావు, ఆర్డీవో రమాదేవి, అధికారులు పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్‌లో డ్రగ్స్ నిర్మూలన, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు.

కొనసాగుతున్న ఆలయ ప్రతిష్ఠాపనలు



యాగం నిర్వహిస్తున్న పురోహితులు

నారాయణఖేడ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలోని శివానగర్ కాలనీలో నిర్మించిన విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠాపనలు కొనసాగుతున్నాయి. గురువారం విశ్వేశ్వరస్వామి సహిత ఆదిత్యాది నవగ్రహ పూర్వక నందీశ్వర, నాగ, గణపతి, అభయాంజనేయ, ధ్వజ, స్థిర విగ్రహాల ప్రతిష్ఠాపనలు నిర్వహించారు. పురోహితుడు మలమంచి మోహన్‌జ్యోషి ఆధ్వర్యంలో శాంతిమంత్రపఠనం, నిత్యపూజ, ప్రధానదేవత హోమాదులు, నేత్రోన్మీళనము, మహాస్నపనము, ధాన్యాధివాసం, ప్రాసాదసంస్కారం, శయ్యాదివాసము, ఫలపుష్పాదివాసము, ప్రదోశకాలపూజ తదితర పూజలు చేశారు. ఇందులో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, డీసీసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌సాగర్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి సహకరించండి



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో రాజేందర్

పటాన్‌చెరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక అభివృద్ధికి సహకరించాల్సిన అవసరం ఉందని ఆర్డీవో రాజేందర్ అన్నారు. గురువారం ఇంద్రేశం మున్సిపల్ పరిధి చిన్నకంజర్ల గ్రామంలో భూసేకరణకు గ్రామసభ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థకు ఇవ్వడానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు భూసేకరణ చేపడుతున్నామని అన్నారు. గ్రామంలోని 113 సర్వేనంబరులోని 187.2 ఎకరాల అసైన్డ్ భూమిని ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లిస్తామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో అక్రమాలు

టేక్మాల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతువేదికలో 2024-25 ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. 29 గ్రామపంచాయతీల్లో రూ.8 కోట్ల పనులు చేపట్టారు. వెంకటాపూర్, అస్సద్ మహ్మద్‌పల్లి, అచ్చన్నపల్లి తదితర గ్రామాల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు గుర్తించారు. ఈ మేరకు రూ.1,69,366 లక్షల రికవరీకి ఆదేశించినట్లు డీఆర్డీఏ ఏసీడీ రంగాచారి తెలిపారు. అక్రమాలకు పాల్పడిన టీఏలకు రూ.11 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రియాజొద్దీన్, ఎస్ఆర్పీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలోకి విద్యార్థుల భవిష్యత్ : యూఎస్ఎఫ్ఐ



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

సంగారెడ్డి రూరల్, నవంబరు (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలోకి నెడుతున్నదని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తాటికొండ రవి, తిరుపతి విమర్శించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఐదురోజులుగా బంద్ పాటిస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. వెంటనే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి జీ.రవి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవితేజ, ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

నారాయణఖేడ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఖేడ్ పట్టణంలోని తహసీల్ గ్రౌండ్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు విద్యార్థులతో ర్యాలీగా వెళ్లి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.8,500 కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతికి వినతిపత్రం అందజేశారు.

న్యూస్ బాక్స్

'దరఖాస్తుదారులు హాజరుకావాలి'

నారాయణఖేడ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట- నారాయణఖేడ్- బీదర్ 161బీ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండల పరిధిలోని బాణాపూర్ శివారులో సేకరించనున్న భూములకు సంబంధించి ఈనెల 12న బాణాపూర్‌లో దరఖాస్తుదారులతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఉమాహారతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఆర్ఐ, సర్వేయర్లు హాజరవుతారన్నారు. దరఖాస్తుదారులు వచ్చి తమ భూములు, గృహాల స్థలాలు వారికి చూపితే రోడ్డు విస్తరణలో భాగంగా అవిపోతాయో, లేవోననే విషయం తెలియజేస్తారన్నారు.

వెంచర్ ప్రహరీ కూల్చివేత

జిన్నారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధి సర్వే నెంబరు 67 ప్రభుత్వ భూమిలో ఓ ప్రైవేటు వెంచర్ నిర్వాహకులు నిర్మించిన ప్రహరిని ఆర్ఐ జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో గురువారం కూల్చేయించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు అక్రమ ప్రహరీని కూల్చేశామని ఆర్ఐ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

కంగ్టి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కంగ్టిలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీవో సత్తయ్య గురువారం పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు.

వైద్య సిబ్బందిని దూషించిన వారిపై ఫిర్యాదు

జిన్నారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్, వైద్య సిబ్బందిని దూషించిన వారిపై పీహెచ్‌సీ డాక్టర్ కోమలి, ఇతర సిబ్బంది జిన్నారం ఎస్ఐ హనుమంతుకు ఫిర్యాదు చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు ఆసుపత్రి వద్దకు వచ్చి డాక్టర్, సిబ్బందిని దూషిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, నిరాధారన ఆరోపణలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐని కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా సదర్

సదాశివపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీ కృష్ణనగర్ కాలనీలో బుధవారం రాత్రి లడ్డుయాదవ్ ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం నిర్వహించారు. దున్నపోతులను అలంకరించి డీజే పాటలు, బ్యాండ్ చప్పుళ్లతో కాలనీల్లో ఊరేగించారు.

శబరిమలైకు బస్సులు

రామచంద్రాపురం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం బెల్ ఆర్టీసీ డిపో నుంచి శబరిమలైకు యాత్రకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని మేనేజర్ సుధ చెప్పారు. సూపర్ లగ్జరీ, రాజధాని ఏసీ బస్సులు నడిపిస్తున్నామని వివరించారు. బస్సు బుక్ చేసిన గురుస్వామికి, ఇద్దరు వంటవాళ్లు, ఇద్దరు కన్నెస్వాములు, సమాన్లు మోసే సహాయకులకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఇస్తామని తెలిపారు. 9391072283, 9063401072 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ

రామాయంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నిర్మూలనపై రామాయంపేటలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో సీడీపీవో స్వరూప, తహసీల్దార్ రజిని, ఎంఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైల్వే ఉద్యోగికి తీవ్రగాయాలు

చేగుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : లారీ, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో రైల్వే ఉద్యోగి(గేట్‌మెన్)కు తీవ్రగాయాలైన సంఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ సమీపంలోని మెదక్ రోడ్డులో గురువారం చోటు చేసుకుంది. చేగుంట మండల పరిధిలోని పోలంపల్లి గ్రామానికి చెందిన మాల రమేష్ చేగుంట రైల్వే గేటు వద్ద గేట్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరాడు. చేగుంట పోలీస్‌స్టేషన్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రమేష్ కాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో మెదక్ ఆస్పత్రికి తరలించారు.

రికార్డు స్థాయిలో కొనుగోళ్లు : వెంకట్‌రాములు



గుండు వెంకట్‌రాములు

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోనే సిర్గాపూర్ మండల పరిధిలోని బొక్కస్‌గామ్ పీఏసీఎస్(ప్యాక్స్)లో రికార్డుస్థాయిలో అన్ని పంటల కొనుగోలు చేపట్టామని ప్యాక్స్ చైర్మన్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ గుండు వెంకట్‌రాములు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గతంలో జిల్లాలోనే అట్టడుగు స్థాయిలో ఉన్న బొక్కస్‌గామ్ పీఏసీఎస్‌ని తాను చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ అయ్యాక ఎంతో అభివృద్ధి పరిచినట్లు తెలిపారు. ముఖ్యంగా రైతుల సౌలభ్యం కోసం ధాన్యం, పెసర్లు, శనిగలు, సోయా, మొక్కజొన్నలు, జొన్నల కొనుగోలు కేంద్రాలను తమ సొసైటీ ద్వారానే అధికంగా నిర్వహించి రైతుల కష్టాలు తీర్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో బొక్కస్‌గామ్ పీఏసీఎస్ పరిధిలోని బొక్కస్‌గామ్, ముబారక్‌పూర్, సుల్తానాబాద్, ఖాజాపూర్, అంతర్గాంలో ధాన్యం, అంతర్గాంలో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇవే కాకుండా రూ.40 లక్షలతో అంతర్గాంలో గోడౌన్ నిర్మించామన్నారు.

పేదల ఆకలి తీర్చడమే ఎంఎస్ఎస్‌వో లక్ష్యం



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు భోజన బాక్స్‌లను అందజేస్తున్న మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆకలి తీర్చడమే మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (ఎంఎస్ఎస్‌వో) లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. గురువారం మెదక్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో భోజన బాక్స్‌లను ఆయన అందజేసి మాట్లాడారు. ఇక నుంచి ప్రతి నెలలో రెండు, మూడుసార్లు పేదలకు భోజనం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగులో మెళకువలు పాటించాలి

జహీరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పండ్ల తోటల సాగులో రైతులు మెళకువలు పాటించాలని డీడీఎస్-కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డా.వర్థప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని దిడిగి గ్రామ శివారులో గల డీడీఎస్-కేవీకేలో రైతులకు పండ్ల తోటల పెంపకం, సాగు విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పండ్ల తోటలు సాగుచేసే రైతులు ఎప్పటికప్పుడు అధికారుల, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలన్నారు. అనంతరం రైతులకు వివిధరకాల పండ్ల మొక్కలను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శైలజ,హేమలత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికల ప్రచారంలో నాయకులు



షేక్‌పేటలో బీఆర్ఎస్ తరఫున ప్రచారం చేస్తున్న మోహిద్‌ఖాన్

నారాయణఖేడ్/తూప్రాన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపినాథ్‌కు మద్దతుగా బీఆర్ఎస్ మైనారిటీ రాష్ట్ర నాయకుడు మోహిద్‌ఖాన్ గురువారం షేక్‌పేటలోని గుల్షన్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గతంలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని సునీతకు ఓటేసి గెలిపించాలని కోరారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, తూప్రాన్ మండల నాయకులు జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధి రహమత్‌నగర్, రాజీవ్‌నగర్‌లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు మామిండ్ల కృష్ణ, బజారు విశ్వరాజ్, రామునిగారి నాగరాజుగౌడ్, జింక మల్లేశ్, చిటిమిల్ల అనిల్, కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణరావు దశదిన కర్మలో భూపాల్‌రెడ్డి



హరీశ్‌రావు తండ్రి దశదిన కర్మలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్/నిజాంపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ దశదిన కర్మను హైదరాబాద్‌లో నిర్వహించారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సత్యనారాయణరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్వర్, నాయకులు సంగప్ప తదితరులు ఉన్నారు. అలాగే నిజాంపేట మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ బజారు తిర్మల్‌గౌడ్, నాయకుడు జీట్టి రమేష్ హరీశ్‌రావును కలిసి, సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బందికి బీమా సౌకర్యం

తూప్రాన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి పోస్టల్‌శాఖ సిబ్బంది ఎక్స్‌ప్రెస్ హెల్త్ ఇన్సూరెన్స్ (ప్రమాదబీమా) నమోదు చేపట్టారు. మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న 78 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. ఇందులో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ చింతల మధు, సిబ్బంది పాల్గొన్నారు.

వృథాగా.. మిషన్ భగీరథ



వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

గుమ్మడిదల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల పట్టణం కానుకుంట చౌరస్తా బస్టాండ్ సమీరంలోని శివాజీ విగ్రహం వద్ద మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. కొన్నిరోజులుగా నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మున్సిపల్ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సు ప్రచార జాతను జయప్రదం చేయండి

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నర్సింహా

సంగారెడ్డి రూరల్, నవంబరు (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించే బస్సు ప్రచార జాతను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నర్సింహా పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని సీపీఐ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16న మెదక్, నారాయణఖేడ్, జహీరాబాద్, 17న సదాశివపేట, సంగారెడ్డి, పటాన్‌చెరులో జాత వస్తుందని, జాతకు స్వాగతం పలుకుతూ సభలు, సమావేశాలు నిర్వహించాలన్నారు. డిసెంబరు 26న ముగింపు ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ సంగారెడ్డి, మెదక్ జిల్లా కార్యదర్శులు జలాలుద్దిన్, ఖలీద్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎంఏ.రహ్మాన్, ఆనంద్, కార్యవర్గ సభ్యులు తాజొద్దీన్, మహబూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అనంతశయన రథోత్సవం

నారాయణఖేడ్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ మండల పరిధిలోని సంజీవన్‌రావుపేటలో అనంతశయన వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం... రథోత్సవాన్ని వీధుల గుండా ఊరేగించారు.